# దుబాయి దస్కం

బేగంపేటలో దిగగాన నేరుగా ఊరెళ్ళాలి. కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదిరిచూస్తున్న మాధవి మొహంలో కోటి చంద్రుల కాంతులు చూడాలి. ముత్యాల్లాంటి పిల్లల బుగ్గల్ని ముద్దులతో నింపేయ్యాలి...

"కాఫీ ప్లీజ్" ఎయిర్ హోస్టెస్ కమ్మని కంఠం. గిరిధర్ బుర్రలో మెలికలు తిరుగుతున్న ఆలోచనల కంతరాయం కల్గించింది.

ఆతని ఆలోచనలతో తనకేమున్నట్టు- విమానం శూన్యంలోకి దూసుకుపోతుంది.

కమ్మని కాఫీ గొంతులోకి జారగానే జరిగిపోయిన రోజులు జ్ఞాపకాల పొరల్లో దోబూచులాడాయి.

పొట్ట కూటికి జెర్రిపోతులాట - అన్నట్టు ఆకలిపొట్టను అరచేతపట్టుకుని దుబాయ్ వెళ్లాల్సొస్తుందని ఎన్నడూ ఊహించలేదు. అర్ధాంగినీ, ఆత్మీయుల్నీ వదలి సముద్రాలు దాటి వేలమైళ్ల దూరంలో, నా అనేవారు నామమాత్రమైనా లేని దేశంలో కాయకష్టం చెయ్యాల్సి వచ్చింది. అందుకేనేమో విధి చేతిలో మనుషులు కీలుబొమ్మలంటారు. వివిధ నాగరికతల్ని ఆకళింపు చేసుకుని- టీ.వి. అనౌన్సర్ల కృత్రిమమైన చిరునవ్వును పెదాలకు పులుముకుని రోజులు నెట్టుకు రావడం అలవాటైంది. పరిస్థితులతో రాజీపడి సహనాన్ని భూషణంగా ధరించక తప్పలేదు. కొంత డబ్బు సంపాదించి కూడబెట్టి స్వదేశం వచ్చి ఏదో ఒక వ్యాపారంలో స్థిరపడాలనే ధ్యేయం పాఠాలు నేర్పింది.

స్వదేశం రావడమిది మూడోసారి.

విదేశం వెళ్లే ముందు తనకొక్కతే కూతురు. మొదటిసారి రాకతో రెండో కూతురూ, రెండోసారి రాకతో కొడుకూ పుట్టుకొచ్చారు. తను దగ్గర లేనప్పుడు రెండు పురుళ్లు పోసుకున్న మాధవి ఎంత బాధపడిందో! భరించాల్సిన భర్తకు దూరంగా ఉండి పిల్లల్ని కంటికి రెప్పలా చూడ్డమంటే మాటలా! ఇప్పుడిహ విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్న నిర్ణయం తృప్తి నిచ్చింది.

బోలెడంత లగేజీతో విమానం దిగి బయటికొస్తుంటే హైద్రాబాదులోనే ఉన్న అక్కా బావలు ఎదురై స్వాగతం పలికారు. గిరిధర్‌లో ఆనంద తరంగమెగిసిపడింది.

"నీ ముద్దుల అల్లుడు నిన్ను రోజుకు వంద సార్లైనా గుర్తు చేస్తాడురా గిరీ!" అంది అక్క తాళమేసున్న దుబాయి సూటుకేసుల్ని ఆశగా చూస్తూ..

"నువ్వుఫారిన్‌లో ఉన్నందుకు సంతోషంగానూ - మాకు దూరంగా ఉన్నందుకు బాధగానూ ఉందోయ్" సామాన్లు టాక్సీలో కెక్కిస్తూ అన్నాడు బావ.

గిరిధర్ ఎద పొంగింది.

"ఊళ్లో మాధవీ, పిల్లలూ బావున్నారా బావా?" అడిగేశాడు ఆత్రంగా.

"ఓ" నవ్వి ఊరుకున్నాడు బావ.

"నీ పిల్లలకేంరా ఉక్కు పిండాలు. నిన్ననే ఉత్తరమొచ్చింది మాధవి నుండి" అంటూ గిరిధర్ చంకనున్న ఎయిర్ బ్యాగందుకోబోయిన అక్కకు అవకాశమియ్యలేదు అతడు.

"ఐతే మా చెల్లాయి మీదా, పిల్లల మీదా బెంగెట్టుకున్నావన్నమాట. వాళ్లను కంటికి రెప్పలా చూచుకునేందుకు మేంలేమా ఇక్కడ!" అన్నాడు బావ.

"కాకితో కబురంపితే క్షణంలో మీరు మా ఊళ్లో వాల్తారనే ధైర్యంతోనే గదా బావా నేనంత దూరంలో నిశ్చింతగా ఉండగలిగింది." గిరిధర్ చిన్నమాట బావ గుండెలకు వెన్నపూస రాసింది.

టాక్సీ పరుగెత్తుతూంటె ఏదో అడగాలనుకుంటూనే ఆపుకుంటున్నాడు గిరిధర్.

"ఈ సారి మా తమ్ముడు మనకు డబుల్ బహుమతులిస్తాడండీ" ఎప్పటికంటే ఎక్కువ సామాన్లను టాక్సీలోంచి తీస్తూ అంది అక్క బావతో.

కమ్మని కబుర్లతో భోజనం- మనసు కెంతో హాయినిచ్చింది.

"తృప్తిగా భోంచేసి ఎన్నాళ్లైందో... మరో స్వీటు వేసుకో గిరీ!" అన్నాడు బావ రెండు మైసూరు పాకులు అదనంగా వడ్డిస్తూ.

"ఇవన్నీ నీ కొరకు ప్రత్యేకంగా చేశాన్రా. మరి మీ బావేమో నీ కొరకే ఈ రోజు సెలవు పెట్టేశాడు." నీ కొరకు కొండ మీది కోతిని దింపుకొచ్చామన్నట్టుగా ఉంది అక్క వాలకం. గడ్డ పెరుగు కొసిరి కొసిరి వడ్డించింది.

పిల్లల్ని చూడాలనే ఆరాటం అధికమైంది. భోజనానంతరం వెల్తానన్నాడు ఊరికి. ససేమిరా ఒప్పుకోలేదు అక్క. బావ సినిమా ప్రోగ్రాం వేశాడు. మనిషి సినిమా హాల్లో ఉన్నా గిరిధర్ మనసు మాధవి చుట్టూ తిరుగుతూంది.

సినిమాలో లీనమైన బావ భుజమ్మీద చెయ్యేసి "బావా! మా కొరకో ఇల్లు

కొనుమని డబ్బు పంపించా గదా! సిటీలో ఇల్లు కొన్నారా! మాధవికి చూపించారా!" అడిగేశాడు.

"ఇండియాలో అడుగుపెట్టి అరుగంటలైనా కాలేదు, అప్పుడే ప్రారంభించావా! అవన్నీ తర్వాత మాట్లాడుకోవచ్చు. తెలుగు సినిమాకి మొహం వాచి ఉన్నావు గదా! ముందా సినిమా చూడు." బావ మందలించాడు.

ఆ మందలింపు చేదుగా ఉంది. "ఇప్పుడు ఆ విషయం ప్రస్తావించాల్సింది కాదేమో!" అనుకున్నాడు.

మాట్నీ నుండి వచ్చేసరికి బడి నుండి వచ్చిన అక్క పిల్లలున్నారింట్లో. మావయ్యా అంటూ చుట్టేశారు.

"మామయ్యొచ్చాడు. మాకేం తెచ్చాడు!" అంటూ గంతులేశారు. వాళ్ల బొమ్మలు వాళ్ల కందాయి. మురుసుకుంటూ పరుగెత్తారు బయట స్నేహితులకు చూపించేందుకు.

అక్కా బావాలకు చెరో రిస్ట్ వాచ్ బహుకరించి.

"నేవెల్తానక్కా!" అన్నాడు.

"మా ఇంట్లో ఇక్క రోజన్నా ఉండకపోతే నన్ను చంపుకుతిన్నంత ఒట్టురా!" నిష్టురమాడింది అక్క.

ఇంతకు ముందు రెండు సార్లు వచ్చినప్పుడిదే వరస. చుట్టాలందరికీ తెచ్చిన బహుమతులు అక్కా బావలే ఒడిపించుకుని, తెచ్చిన డబ్బులో సగం వరకూ కరిగించి పంపించారు. మిగతా చుట్టాల కొరకు హైద్రాబాదులోనే బహుమతులు కొనాల్సి వచ్చింది. తెచ్చిన డబ్బుతో ఏదేదో చేద్దామనుకున్న అంచనాలు తారుమారై చేదు అనుభవం ఎదురైంది. ఈసారి జాగ్రత్తగా మెలగాలనే నిర్ణయం దుబాయ్‌లోనే జరిగిపోయింది.

రాత్రి భోజనాలైనాయి.

"దుబాయ్ నుండి ఏమేం తెచ్చావే చూపించురా తమ్ముడూ!" అంటూ సూటుకేసులు తెచ్చి ముందుంచింది అక్క. మొదట గతుక్కుమని ఆ తర్వాత.

"ఈ సూటుకేసు అప్పుడే విప్పితే మళ్లీ ప్యాక్ చెయ్యడం కష్టమక్కా!" టీ.వీ. మీద దృష్టి నిలిపాడు. రంగుల టీ.వీలోని రంగులన్నీ అక్కా బావల మొహాల మీది కొచ్చేశాయి.

"అద్సరే... నువ్వొస్తున్నావని తెలిసి బంజారా హిల్స్‌లో ఓ ప్లాట్ కొనేశానోయ్. కొంత డబ్బు సర్దాను. మిగితాది ఎల్లుండిచ్చి రిజిష్టర్ చేయించుకోవాలి.

ఓ ఇరవై వేలు సర్దేసెయ్." హుషారులో మర్యాద మేళవించి అడిగాడు బావ.

రెండు నిమిషాల పాటు ఏం మాట్లాడాలో తోచలేదు. తర్వాత సర్దుకుని "చాలా సంతోషం బావా, కాని నేను వచ్చేప్పుడు నగదేమీ తేలేదు. కంపెనీ వాళ్లు తర్వాత పంపిస్తామన్నారు. సారీ బావా!" అనేశాడు ధైర్యం కూడగట్టుకుని.

అక్కా బావల గుండెల్లో బాంబులు పేలాయి. ఐదు నిమిషాలు ఒకనికొకరు చూచుకున్నారు ఆశ్చర్యంగా. అపచారమేదో జరిగిపోయినట్టు ఇదైపోతున్నారు.

"తమ్ముడూ! నీకొరకు మాధవీ, పిల్లలు ఎంతగా ఎదిరి చూస్తున్నారోరా!" అంది అక్క కొత్త విషయం ప్రస్తావించినట్టు.

"ఇప్పుడు టైం ఎనిమిదైంది. తొమ్మిదికి మీ ఊరికి బస్సుంది గదా!" గుర్తు చేశాడు బావ. ఎంతో మేలు చేస్తున్నట్టు టాక్సీని స్వయంగా పిలిచి సామాను లెక్కించేశాడు.

రెండు గంటల ప్రయాణం. పదకొండు కల్లా ఊరుచేరాడు.

ఒక్క పిలుపుతో పరుగెత్తుకొచ్చి తలుపు తీసింది మాధవి. వరుసగా వారం రోజులు ఉపవాసం చేసినట్టుంది. పలుకరిస్తే బావురుమనే కళ్లు..

"ఇదేమిటి మాధవీ!" అడిగాడు.

గుండెల మీద వాలి సేద దీర్చుకుంది. కాళ్లను చుట్టేసి కన్నీళ్లతో పాదాలను కడిగినంత పంజేసింది.

"బాధపడకు. నేనొచ్చాను గదా మాధవీ! బోనసూ, గ్రాట్యుటీ అన్నీ తీసుకొచ్చాను. మళ్లీ వెళ్లనిహ..." అంటూంటే గిరిధర అంతరంగం పొంగుకొచ్చింది. నిద్రిస్తున్న పిల్లల చెంపల్ని ముద్దులతో నింపేశాడు. తాను వెళ్లేప్పుడు పున్నమి చంద్రుడిలా కళకళలాడుతున్న మాధవి మొహం ఎండకు వాడిన పూవులా వెలవెలబోతుంది!?

"నీకివ్వమని బావకు నెలనెలా వెయ్యి రూపాయలు పంపించాను. అతడొచ్చి నీ కందించడం లేదా - డబ్బు సరిపోవడం లేదని వ్రాశావు." అడిగాడు మంచమ్మీద ఒరుగుతూ వంటకుపక్రమించబోతున్న భార్యను వారించాడు.

"నాకొక్క పైసా అందలేదు. మీరు వెళ్లిన నాటి నుండి అన్నయ్యగానీ, వదినగానీ చుట్టాలుగానీ ఈ ఛాయలకే రాలేదు." అంది మాధవి.

కరెంట్ షాక్ కొట్టినట్టైంది. లేచి కూచున్నాడు.

"సిటీలో మనకో ఇల్లు కొనుమని బావకు యాభయివేల రూపాయలు డ్రాఫ్ట్ పంపాను."

" ఆసంగతి నాకసలే తెలియదు."

చెంప ఛెళ్లుమన్నట్టయింది. వీపు మీద కొరడా దెబ్బ పడి నట్టనిపించింది.

"మీరు మీ బావకు డబ్బులు పంపిస్తున్నట్టు నాకు తెలియదు. బీడీలు చేస్తూ రోజులు గడుపుతున్నా. పిల్లల బడి ఫీజులకు డబ్బులు బదులుగా పంపుమని రాసానోసారి మీ అక్కకు.

'మా తమ్ముడు పంపిన డబ్బంతా జల్సాగా ఖర్చు బెడుతూ గజ్జెల గుర్రం లాగైపోతున్నావు, అని జవాబు రాసింది. పిల్లలకు జ్వరాలొస్తే మా తమ్ముడిని వంద రూపాయలు అడిగా. వాడివ్వలేదు. మీరొచ్చినప్పుడే నండీ బంధువులంతా రాబందుల్లా వచ్చి బహుమతులు లాక్కెల్తున్నారు. మీరు విమానం ఎక్కగానే వీళ్లు ఇమానం మరుస్తారు.." కపోలాలను తడిపిన మాధవి కంటిధారలు గుండెల్ని తడిపేస్తున్నాయి.

కాలుజారి అగాధంలో కూరుకుపోయినట్టనిపించింది గిరిధర్‌కు. గుండెల్ని పిండేస్తుంది మాధవి వాలకం.

మర్నాడు ఇల్లంతా చుట్టాలతో నిండిపోయింది. చిన్నసైజు జాతరలాగుంది. మాధవి అక్క శైలజ మందహాసం చిందిస్తూ

"చెల్లెమ్మా, మా ముద్దుల మరిది మా కోసమేం తెచ్చాడే?" అంది.

మాధవికి ఒళ్లు మండింది.

"మీ మరిదిగారెళ్లింతర్వాత మీరు నాకేం తెచ్చారో అదే తెచ్చాడక్కా!" అంది.

శైలజ మొహం కంద గడ్డలాగైపోయింది. కత్తివేటుకు నెత్తురు చుక్క లేదా మొహంలో. శైలజ సామాన్లు సర్దుకుంది. అప్పుడే వచ్చాడు మధుసూదన్. అతడే మాధవి తమ్ముడు. కాస్సేపామాటా ఈ మాటా మాట్లాడి "ఆ టేప్ రికార్డర్ నా కొరకేనా బావాజీ!" అడిగాడు - కొత్త రికార్డర్‌ను కన్నార్పకుండా చూస్తూ.

"జానేయ్ మధుసూదన్! నేను లేనప్పుడు మీ అక్కకు వంద రూపాయలైనా ఇవ్వనందుకు నీకో మాంచి బహుమతియ్యాల్సిందే. సిగ్గులేక పోతే సరి." గుడ్లురిమాడు గిరిధర్. మధుసూదన్ చూపులు నేలకతుక్కు పోయాయి. సిగ్గు తలెత్తనీయలేదు. సంచి సర్దుకొమ్మంది.

బహుమతులందలేదని వచ్చిన చుట్టాలందరూ తిరిగి వెళ్లిపోయారు. సాయంత్రాని కల్లా టేకువనంలో రాళ్లవాన వెలిసినట్లైంది.

"వీళ్లంతా నిజంగా రాబందులే!" గొణిగాడు గిరిధర్.

"బెల్లమున్నంత సేపేనండీ ఈగలు ముసిరేది" భర్త కళ్లల్లోకి సూటిగా చూచింది మాధవి.

(జలధి పక్షపత్రిక 1991- కథల పోటీలో ప్రథమ బహుమతి)